క్లుప్తంగా

ముమ్మరంగా దసరా ఏర్పాట్లు



తాడూరు: దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయ సముదాయం ఎదుట జమ్మిచెట్టును ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీ సిబ్బంది ఆదివారం పరిసరాలను శుభ్ర చేశారు. సర్పంచ్ యాదమ్మ మాట్లాడుతూ గ్రామస్తుల సహాయ సహకారాలతో పరిసరాలు అంతా శుభ్రం చేసి విద్యుత్ దీపాలంకరణ చేస్తున్నామన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

కొల్లాపూర్(పెద్దకొత్తపల్లి): మారేడుమాందిన్నె గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ వార్డు సభ్యురాలు సీతారాంబేబితోపాటు 15 మంది కార్యకర్తలు ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం బీఆర్‌ఎస్‌లో చేరారు. గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై ఆకర్శితులై ఇతర పార్టీల నాయకులు పార్టీలో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సునీత, శ్రీకృష్ణ, శ్రీహరిరావు, శంకర్, గణేష్‌రావు, రాజేందర్‌గౌడ్, నాగరాజు, శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

అభాగ్యురాలికి ఆర్థికసాయం

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని బలరాంనగర్ కాలనీలో నివాసముంటున్న మహిళ సువార్తమ్మ కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న మిత్ర ఫౌండేషన్ సభ్యులు ఆదివారం ఆమె ఇంటి వద్దకు వెళ్లి 25 కిలోల బియ్యం, నెలకు సరిపడా మందులను కొనుగోలు చేసి అందజేశారు. పేదలకు ఆదుకునేందుకు ఫౌండేషన్ ఎప్పుడు ముందు ఉంటుందని సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మిత్ర ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

అమరుల ఆశయాలు సాధిద్దాం



కొల్లాపూర్: తెలంగాణ రాష్ట్ర సాధనలో భాగంగా అమరులైన ఆశయాలు సాధించాలని జనసేన నియోజకవర్గ కోఆర్డినేటర్ బైరపోగు సాంబశివుడు అన్నారు. ఆదివారం పట్టణంలో జనసేన పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. బీఆర్‌ఎస్ పాలనలో అమరుల కుటుంబాలను విస్మరించారన్నారు. ప్రజాసమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం అయ్యిందన్నారు. కార్యక్రమంలో నాయకులు రఘు, మల్లేష్, రాఘవేంద్ర నాయుడు తదితరులున్నారు.

సారా పట్టివేత: కేసు నమోదు

ఉప్పునుంతల: మండలంలోని తిప్పాపూర్ తండాకు చెందిన కాట్రావత్ హర్యానాయక్ ఆదివారం నిషేధిత సారాను తరలిస్తున్నాడు. ఆదివారం తిప్పపూర్ గేట్ వద్ద పోలీసులు నిర్వహించిన తనిఖీలో అతని వద్ద సారా ఉన్నట్లు గుర్తించారు. ఆరు లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గురుస్వామి తెలిపారు.

జగదీశ్వర్‌రావు చిత్రపటానికి పాలాభిషేకం

కొల్లాపూర్: చింతలపల్లి జగదీశ్వర్‌రావు తిరిగి కాంగ్రెస్‌లో చేరడంతో ఆపార్టీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాముయాదవ్ ఆధ్వర్యంలో పట్టణంలో ఆ పార్టీ నాయకులు జగదీశ్వర్‌రావు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి జూపల్లి కృష్ణారావు గెలుపు ఖాయమన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు ఉన్నారు.

జూపల్లి గెలుపు ఖాయం



కొల్లాపూర్(పెంట్లవెల్లి): రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కొల్లాపూర్ నియోజవర్గ కాంగ్రెస్ అభ్యర్థి జూపల్లి కృష్ణారావు గెలుపు ఖాయమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై ప్రజలు అసంతృప్తితో ఉన్నారని పేర్కొన్నారు. పదేండ్ల పాలనలో కేసీఆర్ చేసిందేమిలేదని విమర్శించారు. అన్నిగ్రామాల ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో రామన్‌గౌడ్, నిరంజన్‌గౌడ్, గోపినాయక్ తదితరులు పాల్గొన్నారు.



పెద్దకొత్తపల్లిలో దుర్గామాతను దర్శించుకున్న ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి



చారకొండలో



ఉప్పునుంతలలో



కల్వకుర్తిలో



అచ్చంపేటలో దుర్గామాతకు పూజలు నిర్వహిస్తున్న మహిళలు

వైభవంగా నవరాత్రోత్సవాలు

సాక్షి, నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా దేవీ నవరాత్రోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఆదివారం పలు దేవాలయాల్లో హోమాలు, అమ్మవారిని వివిధ రూపాల్లో ప్రత్యేకంగా అలంకరించారు. పెద్దకొత్తపల్లిలో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. అచ్చంపేట, కొల్లాపూర్, తెలకపల్లి, మన్ననూర్‌లో మహిషాసురమర్ధిని, కల్వకుర్తి, తాడూరు, ఉప్పునుంతల, లింగాల, పెంట్లవెల్లి, చారకొండలో దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేశారు. పలు మండపాల వద్ద అన్నదానం చేశారు.

భక్తిశ్రద్ధలతో చండీ హోమం



అచ్చంపేటలో చండీయాగంలో పాల్గొన్న భక్తులు



కల్వకుర్తిలో ..

కల్వకుర్తిరూరల్: దసరానవరాత్రి ఉత్సవాల సందర్భంగా పట్టణంలోని వాసవీకన్యకాపరమేశ్వరి దేవాలయంలో ఆదివారం చండీహోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 50 మంది దంపతులు చండీహోమంలో పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రమేష్‌బాబు, ఆర్యవైశ్యసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, కోశాధికారి జగదీశ్వర్, అదనపు ప్రధాన కార్యదర్శి శ్రీధర్, అశోక్, రాజేందర్, శ్రీనివాస్, రాము తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేట రూరల్: పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో దేవీశరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం చండీయాగం నిర్వహించారు. ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు, అమల, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ వంశీకృష్ణ, అనురాధ దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు యాగంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ పండుగ



అచ్చంపేటలో బతుకమ్మను తిలకిస్తున్న మహిళలు



వెల్దండ మండలం అజిలాపూర్‌లో

అచ్చంపేట రూరల్: పట్టణంలోని స్మృతివనంలో మున్సిపల్ కార్యాలయం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. బతుకమ్మలను అందంగా పేర్చి ఊరేగింపుగా మహిళలు స్మృతివనానికి చేరుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, కమిషనర్ శ్రీహరిరాజు, జీబీఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్ గువ్వల అమల, మహిళలు పాల్గొన్నారు.

వెల్దండ: మండలంలోని అజిలాపూర్, బైరాపూర్ తదితర గ్రామాల్లో బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బతుకమ్మలను వివిధ పూలతో అందంగా పేర్చారు. బొడ్డెమ్మలు ఆడుతూ ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుల ఇంటింటి ప్రచారం

లింగాల: మండలంలోని పలు గ్రామాలలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. ఎమ్మెల్యే బరిలో ఉన్న డాక్టర్ వంశీకృష్ణకు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, యువజన అధ్యక్షులు శ్రీనివాస్‌రాథోడ్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ఆరు గ్యారంటీ పథకాలపై అవగాహన కల్పించారు. బీఆర్‌ఎస్ ప్రజలను మరోసారి మోసం చేయుటకు అమలు కాని పథకాలతో మభ్యపెడుతుందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు నారాయణగౌడ్, కొండల్‌రావు, లింగస్వామి, లక్ష్మణ్‌నాయక్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



లింగాలలో ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

కాంగ్రెస్‌లో చేరికలు

తాడూరు: మండలంలోని చర్లిటిక్యాలలో ఆదివారం గ్రామానికి చెంది 80 మంది బీఆర్‌ఎస్‌తోపాటు ఆయా పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. జెడ్పీటీసీ రోహిణి, గ్రామానికి చెందిన రామకృష్ణ సత్యంగౌడ్ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ కండువా కప్పి వారిని ఆహ్వానించారు.

క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్

కొల్లాపూర్(పెద్దకొత్తపల్లి): క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ అన్నారు. ఆదివారం మండలంలోని నక్కలపల్లిలో యువకులకు క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. క్రీడలతో శారీరక ధారుఢ్యం పెరుగుతోందన్నారు. కార్యక్రమంలో బాలస్వామి, మల్లేష్, భాస్కర్‌రెడ్డి, రవిందర్‌రెడ్డి, ఈశ్వరయ్య పాల్గొన్నారు.



వైద్యుల నిర్లక్ష్యంతోనే యువకుడి మృతి?

- ఆరోపిస్తూ.. ప్రైవేటు ఆస్పత్రి ఎదుట కుటుంబ సభ్యులు, బంధువుల నిరసన

అచ్చంపేట రూరల్: చికిత్స నిమిత్తం అచ్చంపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి వచ్చిన ఓ యువకుడు వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతిచెందాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ.. ఆదివారం సాయంత్రం ఆ ఆస్పత్రి ఎదుట రాస్తారోకో చేపట్టారు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. లింగాల మండలం కొత్తకుంటపల్లికి చెందిన ఉడుతనూరి మల్లేష్(29) తీవ్ర జ్వరం, కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఆదివారం మధ్యాహ్నం పట్టణంలోని లింగాల రోడ్డులోని డీబీఆర్ ఆస్పత్రికి కుటుంబ సభ్యులు తీసుకొచ్చారు. యువకుడిని పరీక్షించిన వైద్యుడు ప్రథమ చికిత్స చేసి సెలైన్ పెట్టి రెండు ఇన్‌జెక్షన్లు ఇచ్చాడు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుడు మహబూబ్‌నగర్ ఆస్పత్రికి రెఫర్ చేశాడు. దీంతో కుటుంబ సభ్యులు పట్టణంలోని ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మల్లేష్ మృతిచెందాడు. యువకుడి మృతికి ప్రైవేట్ ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని డీబీఎం ఆస్పత్రి ఎదుట, లింగాల ప్రధాన రహదారిపై మృతదేహం ఉంచి రాస్తారోకో చేపట్టారు. కుటుంబానికి న్యాయం చేయాలని పలువురు కుటుంబ సభ్యులకు మద్దతు పలికారు. మృతుడికి భార్య ఎల్లమ్మతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ విషయమై ఆస్పత్రి వైద్యుడు తారాసింగ్‌ను వివరణ కోరగా.. మృతుడి రెండు ఊపిరితిత్తుల్లో నీరు ఎక్కువగా ఉందని, పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రథమ చికిత్స చేసి వెంటనే మహబూబ్‌నగర్ ఆస్పత్రికి రెఫర్ చేశామన్నారు. తమదేమి నిర్లక్ష్యం లేదని తెలియజేశారు.



ప్రైవేటు ఆస్పత్రి ఎదుట రోడ్డుపై మృతదేహంతో రాస్తారోకో చేపడుతున్న మృతుడి కుటుంబ సభ్యులు

పీసీసీఎఫ్‌కు ఘన సన్మానం



మన్ననూర్: ఉన్నతాధికారి పదవీవిరమణ సందర్భంగా అటవీశాఖ ఆధ్వర్యంలో ముందస్తు వీడ్కోలుతో పాటు పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు. ఈ నెల 30వ తేదీన పీసీసీఎఫ్ పదవివిరమణ పొందనున్న పీసీసీఎఫ్ లోకేష్ జైస్వాల్ ఆదివారం విధులలో భాగంగా అమ్రాబాద్ పులుల రక్షిత అభయారణ్యం పరిసర ప్రాంతానికి వచ్చారు. దీంతో మన్ననూర్ అటవీశాఖ చెక్‌పోస్టు సమీపంలోని వనమాలికా ప్రాంగణంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పీసీసీఎఫ్ మాట్లాడుతూ అడవులు, వన్యప్రాణుల మనుగడను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో ఏటీఆర్ ఎఫ్‌డీ క్షితిజ, డీఎఫ్‌ఓలు రోహిత్‌రెడ్డి, రాజశేఖర్, ఎఫ్‌డీఓ విశాల్, ఎఫ్‌ఆర్‌ఓలు ప్రభాకర్, ఈశ్వర్, ఆదిత్య, డీఆర్‌ఓలు లక్ష్మీకాంత్, రవి, ఎఫ్‌ఎస్‌ఓలు ముజీబ్, పర్వతాలు, వెంకటేశ్వర్లు, శ్రీకాంత్, బాబలి తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో జర్నలిస్టు మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: గుండెపోటుతో జర్నలిస్టు మృతి చెందిన సంఘటన జిల్లా కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. కుటుంబసభ్యుల వివరాల ప్రకారం జిల్లా కేంద్రంలో ఓ ఉర్దూ ప్రతికలో స్టాఫ్ రిపోర్టర్‌గా పనిచేస్తున్న అహ్మద్ ఖాన్(38) అకస్మాత్తుగా గుండెపోటుకు గురయ్యాడు. గమనించిన కుటుంబసభ్యులు జనరల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. అహ్మద్ ఖాన్ మృతిపట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

మహాసభల పోస్టర్లు ఆవిష్కరణ



కొల్లాపూర్: హైదరాబాద్‌లో ఈనెల 29, 30 తేదీలలో ఏఐవైఎఫ్ రాష్ట్ర రెండో మహాసభలు నిర్వహిస్తునట్లు మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు ఆర్ ఇందిర పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలో మహాసభకు సంబంధించిన పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఇందిర మాట్లాడారు. యువజన సమస్యల పరిష్కారం, ఉద్యోగాల కల్పన వంటి అంశాలపై మహాసభల్లో చర్చిస్తారని వివరించారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం యువతను మాయమాటలతో మోసం చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడు యూసుఫ్, కార్యదర్శి నవీద్, రమేష్, శివ, సంతోష్, దాసు, రవి తదితరులున్నారు.

మాదాసీ, మాదారి కురువల ఆత్మీయ సమ్మేళనం



కొల్లాపూర్: పట్టణంలో మాదాసీ, మాదారి కురువల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం ఆ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు శారదా లోకేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. మాదాసీ, మాదారి కురువలకు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. మక్తల్‌లో మంత్రి కేటీఆర్ ఇచ్చిన హామీ ఇప్పటివరకు నెరవేరలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీకి మద్దతు ఇవ్వాలో భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికను, రాజకీయ నిర్ణయాలను త్వరలోనే ప్రకటిస్తామన్నారు. సమావేశంలో నాయకులు ఓరె మల్లయ్య, స్వామి, తిరుపతయ్య, శేషన్న, ఈదన్న, రాంబాబు, కురుమయ్య, చంద్రయ్య తదితరులున్నారు.

ప్రజాసేవే లక్ష్యం

అచ్చంపేట రూరల్: నియోజకవర్గ ప్రజాసేవే లక్ష్యంగా పనిచేస్తున్నానని, చివరిరక్తపుబొట్టు వరకు పోరాడతానని, అవసరమైతే అచ్చంపేట మట్టిలోనే కలిసిపోతానని ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. ఆదివారం పట్టణంలోని ఆయన స్వంత గృహం వద్ద నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకుల సీఎం ఆశీర్వాద సభ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈనెల 26న అచ్చంపేటలో జరిగే సీఎం కేసీఆర్ ఆశీర్వాద సభకు జన సమీకరణ చేయాలని కోరారు. సీఎం కేసీఆర్ ఆశీర్వాద సభకు లక్ష మందితో గర్జించి అచ్చంపేట చరిత్రను తిరగరాద్దామన్నారు. ప్రజలే నా ప్రాణంగా పనిచేస్తున్నానని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ సభ ద్వారా అచ్చంపేటలో హ్యాట్రిక్ విజయాన్ని అందుకుందామన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు, బీఆర్‌ఎస్ కార్యకర్తలు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు మనోహర్, అమినోద్దిన్, లాలుయాదవ్, నర్సయ్యయాదవ్, నర్సింహగౌడ్, గోపాల్‌నాయక్, నాగయ్యగౌడ్, నర్సింహ, రమేష్, ప్రవీణ్, అనీల్, వంశీనాయక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బాలరాజు

మద్యం దుకాణాలపై దాడులు



బల్మూర్: మండల కేంద్రంతో పాటు అచ్చంపేట మండలాల్లో బెల్ట్ షాప్‌లపై ఆదివారం అచ్చంపేట ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో బల్మూర్ మండలంలోని గోపాల్‌రావునగర్‌తండాలో శ్రీను, అచ్చంపేటలో యాదగిరి అనే వ్యక్తుల నుంచి నాలుగు కాటన్ల బీర్లు, 69 క్వాటర్ల మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాలరాజు తెలిపారు.

సబ్‌స్టేషన్‌లో ఆయుధ పూజ



అచ్చంపేట రూరల్: పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో విజయదశమిని పురస్కరించుకుని ఆదివారం ఆ శాఖ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఆయుధ పూజను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈ ఆంజనేయులు మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు, రైతులకు నాణ్యమైన 24 గంటల పాటు విద్యుత్ అందిస్తున్నామన్నారు. ఎలాంటి సమస్యలను ఉన్నా సిబ్బంది సాయంతో వెంటనే పరిష్కరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సబ్ ఇంజనీర్ మహేష్, సూర్యం, లాలయ్య, వెంకట్‌రెడ్డి, లైన్‌మెన్లు నిరంజన్, శ్రీధర్, వెంకటస్వామి, స్వామి, రవి, రఘుపతి, శంకర్, ఆపరేటర్లు వెంకట్రాం, శేఖర్, వెంకట్ రెడ్డి, దేవేందర్, శివ, కాంట్రాక్టర్ మురళి, విద్యుత్ కార్మికులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



వెల్దండ: మండలంలోని రాచూర్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు గున్నెల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు సింగిల్ విండో వైస్ చైర్మన్ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. మొదటి విజేత పీబీకేఎస్ జట్టుకు రూ.30వేల నగదు, సీల్డ్, రెండో విజేత స్వచ్ఛ్ భారత్ జట్టుకు రూ.20వేల నగదు, సీల్డ్, మూడో విజేతకు రాహుల్ జట్టుకు రూ.10వేల నగదు, సీల్డ్‌లను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్రావులు, శ్రీశైలం, సంతోష్, నిర్వాహకులు ప్రశాంత్, రాజు, శ్రావణ్, వెంకటేష్, కృష్ణమాచారి, రాజశేఖర్ ఉన్నారు.

కర్ణాటక పథకాలపై ఆరా



మన్ననూర్: కర్నాటక రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో అమలవుతున్నాయని రాయచూర్ జిల్లా వాసులు తెలిపారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, వటువర్లపల్లి సర్పంచ్ చత్రునాయక్ పేర్కొన్నారు. ఆదివారం శ్రీశైలం పుణ్యక్షేత్రాన్ని దర్శించుకునేందుకు వెళ్తున్న కర్నాటక రాష్ట్రం రాయచూర్ జిల్లాకు చెందిన వారితో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా అభివృద్ధి పథకాలు, ఆసరా పింఛన్లు, ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత కరెంటు తదితర పథకాలపై అడిగి తెలుసుకున్నారు. కర్ణాటకలోని కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై తప్పుడు ప్రకటనలు చేసే బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలని ఆయన సవాల్ విసిరారు. అంతకు ముందు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీగా ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలతో గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో అమ్రాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు హరినారాయణ, డీసీసీ ఉపాధ్యక్షుడు బుచ్చయ్య, ఎంపీపీ శ్రీనివాసులు, సాలి, గోపి తదితరులు పాల్గొన్నారు.

కంకర పరిచారు.. బీటీ మరిచారు



చెన్నోళ్లకాలనీ రోడ్డుపై వేసిన కంకర

తాడూరు: మండలంలోని యాదిరెడ్డిపల్లి నుంచి చెన్నోళ్ల కాలనీ మీదుగా ఐతోల్‌కు వెళ్లే రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా సంబంధిత కాంట్రాక్టర్ కంకర పరిచారు. నెలరోజులు కావొస్తున్నా బీటీ నిర్మాణ పనులు చేపట్టడంలో జాప్యం చేస్తుండటంతో వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ దారి గుండా వాహనదారులు వెళ్లేందుకు జంకుతున్నారు. నిధులు మంజూరు అయిన పనులు ఆలస్యం కావడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ చూపి పనులు పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

జిన్‌కుంట సర్పంచ్ ఆకస్మిక మృతి



శ్రీనువాసులు(ఫైల్)

బల్మూర్: మండలంలోని జినుకుంట సర్పంచ్ శ్రీనువాసులు(40) ఆదివారం రాత్రి ఆకస్మిక మృతి చెందాడు. బాధిత కుటుంబసభ్యుల వివరాల ప్రకారం అచ్చంపేట పట్టణంలోని అత్తవారి ఇంటికి వెళ్లాడు. అక్కడ అకస్మాత్తుగా ఫిట్స్ వచ్చి కింద పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు అతడిని చికిత్స నిమిత్తం నాగర్‌కర్నూల్‌కు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు, గ్రామస్తులు తెలిపారు. సర్పంచ్‌కు భార్య గాయత్రితో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.